సాక్షి
వికారాబాద్
గురువారం । 23 । జనవరి । 2025



**నిరసనలు.. నిలదీతలు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలు గందరగోళం నడుమ కొనసాగుతున్నాయి. 8లో▸



**సభలు సామరస్యంగా..**

సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సూచించారు. 8లో▸



**సరుకులు పక్కదారి!**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది సరుకులను పక్కదారి పట్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 9లో▸

## న్యూస్‌రీల్

### ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



రామలింగేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

**తాండూరు రూరల్:** మండల పరిధిలోని జినుగుర్తి గ్రామ శివారులో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం జినుగుర్తి గ్రామసభలో పాల్గొన్న అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తమ్‌చందు, జెన్నె నాగప్ప, రఘు, కిషోర్, నరేష్‌గౌడ్, ఆసీంఅలీ, పండరి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

### సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

**అనంతగిరి:** జిల్లాలో నిర్వహించనున్న సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో అంధులకు, 30న అంగవైకల్యం ఉన్నవారికి క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 24న తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అంగవైకల్యం, 29న చెవుడు, మూగ లోపం ఉన్న వారికి, 30న బుద్ధిమాంద్యం ఉన్న వారి కోసం సదరం క్యాంప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

### స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోండి

**అనంతగిరి:** దివ్యాంగుల ఆర్థిక స్వావలంబన కోసం 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను 24 యూనిట్లు మంజూరు చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, అనుబంధ పరిశ్రమల సేవా వ్యాపారాలు స్థాపించుకొని జీవనోపాధి పొందాలనే ఉద్దేశ్యంతో బ్యాంకు లింకేజీ లేకుండా వయో వృద్ధుల శాఖ తరపున నేరుగా రూ. 50వేల సబ్సిడీతో 24 యూనిట్లు 12లక్షల సబ్సిడీ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు దివ్యాంగత్వం 40శాతంపైన ఉండాలన్నారు. 21–55 సంవత్సరాల లోబడి ఉండాలన్నారు. ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాలలో రూ. 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షలు లోపు ఉన్న వారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఎస్–9 రెండో అంతస్తులోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### నేడు చేగూరుకు సీఎస్ శాంతికుమారి

**కొత్తూరు:** నందిగామ మండలం చేగూరులో గురువారం నిర్వహించనున్న ప్రజాపాలన గ్రామసభకు సీఎస్ శాంతికుమారి హాజరు కానున్నట్లు తహసీల్దార్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షేమ పథకాల అర్హుల జాబితా, ఎంపిక ప్రక్రియను ఆమె పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

### 25న విద్యుత్ వినియోగదారుల సదస్సు

**మహేశ్వరం:** కందుకూరు డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఈనెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు ఆశాఖ డీఈ గోపాలకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కందుకూరు, మహేశ్వరం, బాలాపూర్, పహాడీషరీఫ్, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు సంబంధించిన వినియోగదారుల సమస్యలు, సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, కొత్త కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి వంటివి పరిష్కరిస్తారని సూచించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### సంచార పశువైద్య అంబులెన్స్ తనిఖీ

**కందుకూరు:** మండల కేంద్రంలో 1962 సంచార పశువైద్య అంబులెన్స్ వాహనాన్ని ఆ ప్రాజెక్టు హెడ్ డాక్టర్ బషీర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్ ద్వారా పశువులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పని తీరును పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, జిల్లా అధికారి రాజబాబు, డాక్టర్ పృథ్వీరాజ్‌రెడ్డి, టెక్నీషియన్ సాయికృష్ణ, వెంకటేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆగుతూ.. సాగుతూ..

**రెండేళ్లుగా కొనసాగుతున్న జనరల్ ఆస్పత్రి భవన నిర్మాణం**

- ఏడాది క్రితమే 80శాతం పూర్తి
- ఆ తర్వాత అడపాదడపా పనులు
- బిల్లుల చెల్లింపులో జాప్యమే కారణం
- పాత భవనంలోనే ఆస్పత్రి సేవలు
- గదులు సరిపోక రోగుల పాట్లు




వికారాబాద్‌లో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం

**వికారాబాద్:** జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏడాదిలో పూర్తి కావాల్సిన పనులు రెండేళ్లు దాటినా భవనం అందుబాటులోకి రాలేదు. గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు నెమ్మదిగా పనులు చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం మారాక కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. వికారాబాద్‌లోని వంద పడకల ఏరియా ఆస్పత్రిని రెండేళ్ల క్రితం జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. 330 పడకలతో సేవలందించాలని నిర్ణయించారు. ఇందుకు గాను రూ.30 కోట్లు కేటాయించారు. 2023లో వికారాబాద్‌లోని ఎస్‌ఏపీ కళాశాల ఎదురుగా భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. 2024 నాటికి పనులు పూర్తి చేసి జనరల్ ఆస్పత్రి సేవలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. నేటికీ 80 శాతం పనులే పూర్తి కావడంతో భవనం అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం బస్టాండ్ దారిలో ఉన్న ఏరియా ఆస్పత్రి పాత భవనంలోనే జనరల్ ఆస్పత్రి కొనసాగుతోంది.

**330 బెడ్లతో జనరల్ ఆస్పత్రి**

రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వికారాబాద్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేసిన విషయం తెలిసిందే. వంద సీట్ల సామర్థ్యంతో గత విద్యా సంవత్సరం నుంచే తరగతులను ప్రారంభించారు. మెడికల్ కళాశాల భవన నిర్మాణం, వసతుల కోసం ప్రభుత్వం రూ.240 కోట్లు మంజూరు చేసింది. అనంతగిరి వెళ్లే దారిలో ఉన్న బిల్ల దాఖలా ఏరియాలో మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటి దాకా అనంతగిరి గుట్టపై టీబీ శానిటోరియం ఆవరణలో నిర్మించిన తాత్కాలిక భవనంలో తరగతులను నిర్వహిస్తున్నారు.

**బిల్లులు రాకపోవడంతోనే..**

గత, ప్రస్తుత ప్రభుత్వాలు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే జనరల్ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తి చేశారు. అయినా 30 శాతం పనులకే బిల్లులు చెల్లించారని కాంట్రాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం వారం రోజులు పనులు జరిగితే ఆ తర్వాత నెలల తరబడి నిలిపేస్తున్నారు. పాత భవనంలో సిబ్బంది, రోగులకు గదులు సరిపోక అవస్థలు పడుతున్నారు. పనులు ఇలాగే సాగితే మరో ఏడాది పట్టినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి జనరల్ ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తెలంగాణ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా రెండు మూడు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేసి జనరల్ ఆస్పత్రి సేవలను అందుబాటులోకి తెస్తామని తెలిపారు.



పరిగి ప్రజాపాలన సభలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

# ప్రతి ఒక్కరికీ సంక్షేమం

- మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- అర్హులకు పథకాలు: ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

**పరిగి:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని 8వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా లక్ష 9వేల మంది రైతులకు రూ. 850 కోట్ల రుణమాఫీని ప్రభుత్వం అందించిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద రంగారెడ్డి రీజియన్‌లో 2కోట్ల 70లక్షల మంది మహిళాలు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించారని, ఇందుకోసం ప్రభుత్వం రూ.98 కోట్లు చెల్లించిందని తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**తాండూరు అభివృద్ధికి నిధులు తెస్తా**

**తాండూరు రూరల్:** తాండూరు అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తెస్తామని చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కరన్‌కోట్‌లో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కరన్‌కోట్‌లో ఇంటి స్థలంలేని నిరుపేదలకు గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగప్ప, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మండల స్పెషలాఫీసర్ సత్తార్, డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్, నాయకులు ఉత్తమ్‌చందు, శరణు బసప్ప, రాజ్‌కుమార్, జర్పప్ప, సుధకర్, వడ్డె శ్రీను, పురుషోత్తంరెడ్డి, జగదీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న అనురాధ

# మెరుగైన వైద్యం మన బాధ్యత

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డా.అనురాధ

**బొంరాస్‌పేట:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం మన బాధ్యత అని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డా.అనురాధ అన్నారు. బుధవారం బొంరాస్‌పేట పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. వివిధ విభాగాలను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలను డాక్టర్ హేమంత్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బంది లేకుండా మరో డాక్టర్‌ను నియమించాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉపకేంద్రాలను తరచూ పరిశీలించాలని ఆదేశించారు. ఎన్‌క్వాస్, కాయకల్పకు పీహెచ్‌సీ ఎంపికైందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అక్షయ్, సీహెచ్‌ఓ శివరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.5 కోట్ల ఆస్తి బుగ్గి పాలు



ఆయిల్ పరిశ్రమలో ఎగిసి పడుతున్న మంటలు

- ఆయిల్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం
- షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ట్యాంకర్
- ఉవ్వెత్తున ఎగిసిపడిన మంటలు
- కార్మికుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం
- ఐదు ఫైరింజన్లతో మంటలను ఆర్పిన సిబ్బంది

**షాద్‌నగర్:** అన్నారం గ్రామ శివారులోని బీఆర్‌ఎస్ ఆయిల్ రిఫైనరీ పరిశ్రమలో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రూ.5 కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ఫ్యాక్టరీలోని నూనె శుద్ధి చేసే యంత్రం వద్ద వెల్డింగ్ పనులు చేస్తుండగా షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి, ఆయిల్ ట్యాంకర్‌కు అంటుకోవడంతో పెద్ద శబ్దంతో పేలింది.



ప్రమాదం ధాటికి పరిశ్రమలో ధ్వంసమైన యంత్రాలు

**విధుల్లో 30 మంది**

ప్రమాదం జరిగిన సమయంలో సుమారు 30 మంది ఉన్నారు. వివిధ యూనిట్లలో పని చేస్తున్న పలువురు మంటలను గమనించి.. కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. మిగిలిన వారు సైతం బయటకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఆయిల్ ట్యాంకర్ పేలిన శబ్దం నాలుగు కిలోమీటర్ల దూరం వరకూ వినిపించగా, ఏంజరుగుతుందో తెలియక సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

**తీవ్రంగా శ్రమించిన సిబ్బంది**

ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న షాద్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు భారీగా ఎగిసి పడుతుండటంతో షాద్‌నగర్, జడ్చర్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్ నుంచి మొత్తం ఐదు ఫైరింజన్లు తెప్పించారు. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి బుధవారం తెల్లవారుజామున 5గంటలకు మంటలను పూర్తిస్థాయిలో ఆర్పివేశారు.

**పోలీసుల దర్యాప్తు**

అనూహ్య ప్రమాదంతో ట్యాంకర్‌లో నిల్వ ఉంచిన ఆయిల్‌తో పాటు, పరిశ్రమలోని పలు యంత్రాలు కాలిపోయాయి. దీంతో రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఫ్యాక్టరీ యజమానులు, పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కలెక్టర్ ప్రతీక్‌జైన్



వికారాబాద్ ప్రజాపాలన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

**అనంతగిరి:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని, లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టెంపల్లి 8వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించిన అర్హుల జాబితాను వార్డు సభలలో ప్రకటిస్తున్నట్లు తెలిపారు. జాబితాలో పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తవారు కూడా దరఖాసు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, ప్రజా ప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కొత్త మెనూ అమలు చేయండి



బాలంపేట కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

**దౌల్తాబాద్:** మండలంలో వివిధ గ్రామాల్లో బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పర్యటించారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. బాలంపేట గ్రామంలోని కేజీబీవీని తనిఖీ చేసి వసతులపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఆదేశించారు. తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వంట గది, బెడ్స్, ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఇందుకు ఏ మేర నిధులు అవసరం అవుతాయో అంచనా వేసి పంపాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆ తర్వాత తిమ్మాయిపల్లిలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. దౌల్తాబాద్‌లో అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రంథాలయంతో పాటు సైన్స్ క్లబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం బీసీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసి వసతులపై ఆరా తీశారు. ప్రహరీ నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దారు గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎస్‌ఐ రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పనులు వేగవంతం చేయాలి**

**కొడంగల్:** వసతి గృహాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను, నర్సింగ్ కళాశాల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. హాస్టళ్ల పరిసరాలు, గదులను పరిశీలించారు. మరమ్మత్తు పనులను గమనించారు. ఇంకా మిగిలి ఉన్న పనులను చేయడానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మ్యాట్రస్ అందజేస్తామని అన్నారు. వసతి గృహాలకు నాణ్యమైన రంగులను వేసి వెలుతురు మంచిగా వచ్చే బల్బులను బిగించాలన్నారు. పట్టణంలోని సమీకృత బాలికల వసతి గృహం ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ తదతరులు పాల్గొన్నారు.

### ఫ్యూచర్ సిటీ రైతులతో అధికారుల సమావేశం



గుమ్మడవెల్లిలో రైతులతో సమావేశమైన అధికారులు

**కందుకూరు:** ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండల పరిధిలోని గుమ్మడవెల్లి, ఆకులమైలారం రైతులతో బుధవారం భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు సమావేశమై చర్చించారు. గుమ్మడవెల్లి 2.10 ఎకరాలకు సంబంధించి నలుగురు రైతులు, ఆకులమైలారంలో మూడున్నర గుంటల భూమికి సంబంధించి మరో రైతుతో మాట్లాడారు. బహిరంగ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ యాదగిరి తదితరులు ఉన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

కొండాపూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సునీతారెడ్డి

**శంకర్‌పల్లి:** ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాల్సిందేనని కొండాపూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) సునీతారెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం శంకర్‌పల్లి పట్టణంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ చౌరస్తాలో మానవహారంగా నిల్చొని, ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపొద్దని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, ట్రైనీ ఎస్‌ఐ చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ అరుంధతి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సునీతారెడ్డి

## క్లుప్తంగా

### బయటకు వెళ్లిన వ్యక్తి.. శవమై తేలాడు


భీమయ్య(ఫైల్)

పరిగి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి శవమై తేలాడు. ఈ ఘటన పట్టణ కేంద్రం లోని కిష్టమ్మగుళ్లతండా సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన టప్ప భీమయ్య(52) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికారు. బుధవారం సాయంత్రం కిష్టమ్మగుళ్లతండాకు వెళ్లే దారిలో గుర్తు తెలియని మృతదేహం కనిపించిందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సంతోష్ కుమార్‌ను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు చేయలేదని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడున్నారని స్థానికులు తెలిపారు.

### 'క్రీడోత్సవ్-2025'ను విజయవంతం చేయండి

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

కొడంగల్ రూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఖేలో భారత్ పేరుతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న క్రీడోత్సవ్-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా కన్వీనర్ హరీశ్ రావు అన్నారు. బుధవారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పట్టణంలో 27, 28, 29 తేదీల్లో క్రీడాపోటీలుంటాయని చెప్పారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి నిఖిల్, ఉపాధ్యక్షుడు నరేశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రవి, ఆదిత్య, సింహాద్రి, అంజి, కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

### ఈత వనానికి నిప్పు


కాలిపోయిన ఈత మొక్కలు

మొయినాబాద్: గుర్తు తెలియని దుండగులు ఈత వనానికి నిప్పంటించారు. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని శ్రీరాంనగర్ గ్రామానికి చెందిన రేనట్ల మల్లేశ్‌గౌడ్ శ్రీరాంనగర్ రెవెన్యూ సర్వే నంబర్ 239లోని మూడెకరాల భూమిలో 800 ఈత మొక్కలు నాటి పెంచుతున్నాడు. ఇటీవల మల్లేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులు తీర్థయాత్రలకు వెళ్లి బుధవారం ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి చూడగా సుమారు 600 ఈత చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో వారు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పరిశీలించారు. ఈ విషయమై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈత చెట్లు కాలిపోయి నష్టం జరిగిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

### దుబాయ్ టోర్నీలో నాగర్‌గూడ విద్యార్థుల సత్తా



చేవెళ్ల: ఇటీవల దుబాయ్‌లో జరిగిన అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో నాగర్‌గూడ యువత సత్తాచాటారు. నియోజకవర్గ పరిధిలోని షాబాద్ మండలం నాగర్‌గూడకు చెందిన సాయి అక్షిత్(9వ తరగతి), సాయి చరిత్(8వ)లు టోర్నీలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ జట్లపై విజయం సాధించేందుకు కృషి చేశారు. టోర్నీ ముగియడంతో మంగళవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి చేరకున్న జట్టు సభ్యులకు ఘన స్వాగతం పలికారు.



# నిరసనలు.. నిలదీతలు

- గందరగోళంగా గ్రామసభలు
- లబ్ధిదారుల జాబితాల్లో అర్హులేరని ప్రశ్నలు
- అనర్హులకే పెద్దపీట వేశారని ఆరోపణలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలు గందరగోళం నడుమ కొనసాగుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్‌కార్డుల ఎంపికకు నిర్వహిస్తున్న ఈ సభలకు జనం పోటెత్తుతున్నారు. వారు ప్రదర్శించిన జాబితాలో తమపేరు లేదంటూ నిలదీస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనలకు దిగుతున్నారు.

## ఏడాదిలో ఇచ్చిందేముంది?


మంచాల: కాగజ్‌ఘట్‌లో గందరగోళం నడుమ కొనసాగుతున్న గ్రామసభ

మంచాల: అధికారులను, అధికార పార్టీ నాయకులను జనం నిలదీస్తున్నారు. బుధవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల, కాగజ్ ఘట్, కొర్రవాణి తండా, దాద్‌పల్లి, చిత్తాపూర్, బోడకొండ, రంగాపూర్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా.. అర్హులను గుర్తించడంలోనూ ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని అధికారులపై కాగజ్ ఘట్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో గ్రామసభను అడ్డుకునేందుకు యత్నించారు. కొత్త ప్రభుత్వం పేదోడికి ఏడాది కాలంలో ఏమిచ్చిందని నిలదీశారు. ప్రజల గొంతునొక్కి గ్రామ సభలు నిర్వహించడంతో ఒరిగేదేమీ లేదన్నారు. ఇప్పటికైనా అర్హులని గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ ఎంవీ.ప్రసాద్, ఎంపీఓ ఉమారాణి, ఏఓ కృష్ణమోహన్, ఏపీఓ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకత ప్రశ్నార్థకం!


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం

దోమ: అర్హత ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలని ప్రభుత్వం ఆదేశిస్తే కొందరు అధికారులు మాత్రం అర్హత లేని వారికి కూడా పథకాలు వర్తింపజేస్తున్నారని మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం మండిపడ్డారు. బుధవారం మండల పరిధిలోని మోత్కూరులో నిర్వహించిన గ్రామసభలో అధికారులు పారదర్శకత పాటించడం లేదని ఆరోపించారు. అర్హులకు జాబితాలో చోటివ్వకుండా ఉద్యోగస్తులు, ధనికులు, కాంగ్రెస్ నేతలకు పథకాలు వర్తించేలా యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారే తప్ప ఎక్కడ సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదన్నారు. దరఖాస్తుల పేరిట ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు అర్హులు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు.

## పార్టీ కేడర్‌కే పథకాలా..?


అధికారులను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు తదితరులు

కుల్కచర్ల: మండల పరిధిలోని ముజాహిద్ పూర్‌లో బుధవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ పార్టీ వారినే ఎంపిక చేశారని బీఆర్ఎస్, ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తూ అధికారులను ప్రశ్నించారు. దీంతో గందరగోళ వాతావరణం నెలకొంది. దీంతో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, ఎంపీడీఓ రామకృష్ణ స్పందించి ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకోవచ్చునని.. అర్హులను గుర్తించి విడతల వారీగా పథకాలు అందిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, జిల్లా నాయకులు స్వామి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ చంద్రభూపాల్, సోమలింగం, చిన్న పులింగ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమయం పాటించేదేలే..


ధారూరులో గ్రామ సభలో ఉదయం 9:44 గంటలకు


ఉదయం 10:34 గంటలకు అధికారల రావడంతో నిండుగా కనిపిస్తున్న గ్రామసభ

ధారూరు: షెడ్యూల్ ప్రకారం బుధవారం ఉదయం 9గంటలకు మండల కేంద్రంలో గ్రామ సభ నిర్వహించాల్సి ఉంది. ఇందుకు అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరైనా.. ప్రత్యేకాధికారి మాత్రం రాలేదు. ఉదయం 10గంటల వరకు ఎదురు చూసిన రైతులు, కూలీలు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. గ్రామ ఇన్‌చార్జిగా ఉన్న మండల ప్రత్యేకాధికారి మల్లేశం కోసం గంటపాటు నిరీక్షించారు. అధికారుల తీరుపై మండిపడుతూ వెనుదిరిగారు. 10.01గంటలకు ప్రత్యేకాధికారి రావడంతో సభను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ప్రత్యేక అధికారి ఎప్పుడు సమయానికి రారు.. గ్రామ సభకుసైతం అదే రూల్ ఫాలో అయ్యారంటూ గ్రామస్తులు వ్యంగ్యంగా మాట్లాడుకుంటూ కనిపించారు.

### పవర్ కట్

పంచాయతీ కార్యదర్శి అంజ్యానాయక్ జాబితా చదువుతున్న సమయంలో కరెంట్ పోవడంతో మైక్ మూగబోయింది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఆవేశానికి గురయ్యారు. మండల కేంద్రానికి ప్రత్యేక ఫీడర్ ఉందంటూ నిత్యం కోతపెడుతున్నారని.. గ్రామ సభ సమయంలోనైనా విద్యుత్ సరఫరా ఉంచరా అంటూ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని నిలదీశారు. ఏఈ వెంటనే సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసినప్పటికీ విద్యుత్ సరఫరా ఆలస్యంగా పునరుద్ధరించడంతో కాంగ్రెస్ శ్రేణులు సైతం ఏఈపై మండిపడ్డారు.

### 'ఇందిరమ్మ ఇళ్లు బంగ్లా ఉన్నవారికేనా?'

గతేడాది ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నా మంజూరవలేదని కూర్జెల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గుడిసె ఉన్నవారికి ఇళ్లు రావు.. బంగ్లా ఉన్నవారికి ఎలా మంజూరయ్యాయని నిలదీశారు. ఎవరికి ఏ పథకం అందకున్నా తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, మీరు దరఖాస్తు చేయండి, తప్పక మంజూరు అవుతుందని పంచాయతీ ప్రత్యేక అధికారి, డీఎస్‌సీడీఓ మల్లేశం పేర్కొన్నారు. నిరసనలు, ఆందోళనల నడుమ దరఖాస్తు చేసుకున్నారు.


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

### టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ఐదు ట్రాక్టర్లు సీజ్

అనంతగిరి: అక్రమ రవాణాను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ అధికారులు నిరంతరం దాడులు చేస్తున్నారని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారంతో యాలాల మండలంలో దాడులు చేయగా రాస్నం శివారులో అక్రమంగా రవాణా చేస్తున్న ఓ కలప ట్రాక్టర్‌తో పాటు విశ్వనాథ్‌పూర్ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి యలాల ఠాణకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### పేదల అభ్యున్నతే.. ప్రభుత్వ అభిమతం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: పేదల అభ్యున్నతే.. కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చౌడాపూర్ మండల కేంద్రంలో రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, తహసీల్దార్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

**శిలాఫలకం ధ్వంసం**

చౌడాపూర్ గ్రామంలో సీసీరోడ్డు ప్రారంభానికి గ్రామంలో శిలాఫలకం ఏర్పాటుకు దిమ్మె నిర్మించారు. దీంతో దిమ్మె ఎదుట ఉన్న ఇంటి వారు ఆదిమ్మెను కూల్చేశారు. తాము ముందే ఇక్కడ ఏర్పాటు చేయొద్దని కోరినా నిర్మించారన్నారు. దీంతో స్థానిక నాయకులు మరో చోట దిమ్మె నిర్మించి అభివృద్ధి పనులు ప్రారంభించారు.

**ప్రజలకు తప్పనితిప్పలు**

చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆలస్యం కావడంతో లబ్ధిదారులు కొంత ఇబ్బందికి గురయ్యారు. రాత్రి 7గంటలకు చెక్కులు అందజేయడంతో దూరప్రాంతానికి వెళ్లాల్సిన మహిళలు ఇబ్బంది పడ్డారు.


జాతీయ రహదారిపై పడుకున్న మందుబాబు

# మందుబాబు హల్‌చల్

- సెల్‌ఫోన్ పోయిందంటూ రోడ్డుపై పడుకుని నిరసన
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- దేహశుద్ధి చేసిన వైన్ షాప్ నిర్వాహకులు, వాహనదారులు

తాండూరు: మద్యం తాగుతున్న సమయంలో సెల్ ఫోన్ పోయిందంటూ ఓ యువకుడు వైన్‌షాపు ఎదుట జాతీయ రహదారిపై హల్‌చల్ చేశాడు. ఈ ఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామానికి చెందిన ఓ యువకుడు మద్యం తాగేందుకు శివాజీ చౌక్ సమీపంలోని వెంకటేశ్వర వైన్స్‌కు వెళ్లాడు. మద్యం బాటిల్‌తో పర్మిట్ రూమ్‌కు వెళ్లి మందు తాగాడు. అదే సమయంలో అతని సెల్ ఫోన్ కనిపించకపోవడంతో కేకలు వేయడం మొదలు పెట్టాడు. ఎవరు తీసుకున్నారో ఇవ్వాలంటూ గట్టిగా అరిచాడు. దీంతో షాపు నిర్వాహకులు సదరు యువకుడిని పర్మిట్ రూమ్ నుంచి బయటకు పంపేశారు. దీంతో మద్యం దుకాణం ఎదుట ఉన్న జాతీయ రహదారిపై పడుకోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఆగ్రహించిన వాహనదారులు, వైన్ షాప్ నిర్వాహకులు సదరు యువకుడికి దేహశుద్ధి చేసి రోడ్డు పక్కకు లాగేశారు.

# సభలు సామరస్యంగా నిర్వహించుకోవాలి

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్


దుద్యాల్: గౌరారం గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

దుద్యాల్: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని గౌరారంలో నిర్వహించిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం వారి గ్రామాల్లోనే అర్హులను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. సభలు సామరస్యంగా నిర్వహించుకోవాలని సూచించారు. చిలుముల మైల్వార్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు తహసీల్దార్ కిషన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్, ప్రత్యేకాధికారి శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఏఓ హిమబిందు, ఏఈఓ భావన, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### అర్హులకు పథకాలు: అదనపు కలెక్టర్ సుధీర్


మర్పల్లి: బిల్‌కల్ గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

మర్పల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బిల్‌కల్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. గతంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు మంజూరయ్యాయన్నారు. మంజూరు కానీ వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెంటు భూమిలేని పేదలకు ఉపాధి హామీ జాబ్ కార్డుద్వారా ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసాకింద ప్రతీ సంవత్సరం రూ.12 వేలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, గ్రామ ప్రత్యేకాధికారి ఎంపీడీఓ రాజమల్లయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, అశోక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గడువు ముగుస్తున్నా.. కుదరని సయోధ్య

వార్డు సభలో చైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య గొడవ


మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

తాండూరు: మరో నాలుగు రోజుల్లో పదవీ కాలం ముగుస్తోన్న చైర్‌పర్సన్, కౌన్సిలర్‌ల మధ్య సయోధ్య కుదరడం లేదు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో చైర్‌పర్సన్ స్వప్న అధ్యక్షతన వార్డు సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు హాజరయ్యారు. సమావేశంలో బాల్‌రెడ్డి ప్రసంగిస్తూ.. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే అభివృద్ధికి నిధులు కేటాయించామన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చిలుక వాగు ప్రక్షాళన పనులు చేయిస్తున్నారని అన్నారు. దీంతో వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెసోళ్లంతా దొంగలు.. చిలుకవాగు అభివృద్ధి పేరిట రూ.లక్షలను అక్రమాలకు పాల్పడ్డారంటూ కౌన్సిలర్ ఆరోపించారు. మరో వైపు తన వార్డులో జరిగే అభివృద్ధి పనులకు ప్రొటోకాల్ పాటించకుండా పనులు చేస్తున్నారన్నారు. దీంతో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ కౌన్సిలర్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పదవీకాలం ముగుస్తోన్న ప్రజాప్రతినిధులు మారడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెసోళ్లు దొంగలు అనడం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, కౌన్సిలర్‌లు, నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు,

# కర్ణాటక టు తెలంగాణ

- నిషేధిత నల్లబెల్లం సరఫరా
- ముఠా గుట్టు రట్టు చేసిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెట్ అధికారులు
- 78.60 క్వింటాళ్ల బెల్లం, డీసీఎం, రెండు ఆటోలు, రూ.1.07లక్షల నగదు సీజ్
- ఆరుగురు ముఠాలో నలుగురి అరెస్ట్

పహాడీషరీఫ్: కర్ణాటక రాష్ట్రం నుంచి రాష్ట్రంలోని పల్లెలకు నిషేధిత నల్లబెల్లం సరఫరా చేస్తున్న ముఠా గుట్టును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. ఆరుగురు సభ్యులున్న ఈ ముఠాలోని నలుగురిని బుధవారం రిమాండ్ తరలించారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు బాలరాజు, చంద్రశేఖర్ తెలిపిన ప్రకారం.. శివకాంత్, మహ్మద్‌బాబా, అరుణ్ నాయక్, హీరాసింగ్, నరేశ్, శ్రీను ముఠాగా ఏర్పడి కర్ణాటక రాష్ట్రంలోని బసవతారకం నుంచి నల్లబెల్లం కొనుగోలు చేసి జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పహాడీషరీఫ్ ప్రాంతంలో నిల్వ చేస్తున్నారు. ఇక్కడ నుంచి నాటుసారా తయారు చేసేందుకు అవసరమైన జిల్లాల వారికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఓ వ్యాన్‌లో 55.20 క్వింటాళ్ల బెల్లం, రెండు ఆటోల్లో 23.40 క్వింటాళ్ల బెల్లం, 40 కిలోల ఆలంను నల్గొండ జిల్లా నేరేడుగూడ ప్రాంతానికి సరఫరా చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు అక్కడకు చేరుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు బాలరాజు, చంద్రశేఖర్ ఆరుగురిపై కేసు నమోదు చేసి.. నలుగురిని అరెస్ట్ చేశారు. నరేష్, శ్రీను పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద రూ.15లక్షల విలువ చేసే 78.60 క్వింటాళ్ల బెల్లం, 40 కిలోల ఆలం, ఓ డీసీఎం, రెండు ఆటోలు, రూ.1.07లక్షల నగదును సీజ్ చేశారు. వీటిని సరూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. ముఠాగుట్టు రట్టు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్

# గృహిణి అదృశ్యం


మమత చౌదరి (ఫైల్)

హయత్‌నగర్: ఇంట్లో ఎవరు లేని సమయంలో బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మదన్‌చౌదరి, మమతాచౌదరి(32) దంపతులు తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ గ్రామంలో నివసిస్తుంటారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. భర్త, కొడుకులు సోమవారం బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. ఈ క్రమంలో మమతా చౌదరి మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులకు ఆమె కనిపించక పోవడంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో మదన్ చౌదరి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# లాడ్జిలో మహిళ మృతదేహం

- అత్యాచారంగా అనుమానం
- దుర్వాసన వస్తుండడంతో వెలుగులోకి వచ్చిన ఘటన
- వివరాలు సేకరించిన పోలీసులు


శివలీల(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఓ లాడ్జిలో మహిళ మృతదేహం లభ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఫరూఖ్‌నగర్ మండలం కందివనం పంచాయతీ పిట్టలగడ్డతండాకు చెందిన శివలీల(35) భర్త చనిపోవడంతో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ప్రస్తుతం ఆమె నందిగామ మండల పరిధిలోని కన్హ శాంతివనంలో పని చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌కు చెందిన దేవదాస్ గతంలో లైన్‌మెన్‌గా పనిచేసేవాడు. అక్కడ ఓ మహిళ హత్య కేసులో జైలుకు వెళ్లడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో కొంతకాలంగా కన్హశాంతి వనంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శివలీల, దేవదాస్‌లకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ నెల 20న బ్యాంకులో పని ఉందని చెప్పి ఇంటి నుంచి షాద్‌నగర్‌కు వచ్చిన శివలీల దేవదాస్‌తో కలిసి ఉదయం 10గంటల సమయంలో పట్టణంలోని సంగమేశ్వర లాడ్జికి వెళ్లింది. బుధవారం గదిలోంచి దుర్వాసన వస్తుండడంతో లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.